# చల్లని నీడ

సునీత సామాన్య కుటుంబంలో పుట్టింది. చదువు పట్ల, ఆమెకి పెద్దగా శ్రద్ధలేక మెట్రిక్ వరకే చదువుకుంది.

సన్నగా, చామనఛాయలో వుండే సునీత, పెద్ద అందగత్తె కాకపోయినా, కురూపికాదు. ఆకర్షణీయమైన ఆకారం. మెట్రిక్ చదువుతన్నప్పుడే ఆమె జీవితంలో ముఖ్యమైన మలుపు వచ్చింది. 'సాంబమూర్తి' అనే వ్యక్తితో పరిచయమయ్యిందామెకి.

సాంబమూర్తి ఓ ప్రయివేటు కంపెనీలో ఆఫీసు అసిస్టెంటుగా పన్జేస్తున్నాడు. ఎప్పుడూ నీటుగా వుండేవాడు. మనిషి మంచివాడే. సునీత ట్యూషన్‌కి వెళ్తుంటే త్రోవలో అనుకోకుండా ఆమెతో పరిచయమయ్యింది. ఆమె అతనికి నచ్చింది. అందుకే, ఆమెతో పరిచయాన్ని అభివృద్ధి పర్చుకున్నాడు.

క్రమంగా వారిద్దరి పరిచయం ప్రణయంగా పరిణమించి, పరిఢవిల్లింది. ఇద్దరూ పరస్పరం ప్రగాఢంగా ప్రేమించుకున్నారు. తమ ప్రేమ విషయం తల్లి దండ్రులకు తెలిస్తే, వాళ్ళు చివాట్లు పెడతారని, తమ వివాహానికి సుతరామూ అంగీకరించరని, సునీతకి బాగా తెలుసు. అయితే, తమ ప్రేమకథకు సమాధి కట్టి, పిరికి దానిలా సాంబమూర్తిని దూరం చేసుకోవడం ఇష్టంలేకపోయింది. సాంబమూర్తి కూడా అదే పరిస్థితిలో వున్నాడు. అంచేత, ఆమెని వివాహం చేసుకోడానికి నిశ్చయించుకున్నాడు.

"ఇలా దొంగచాటుగా యెన్నాళ్ళు తిరుగుతాం సునీతా? హాయిగా మనిద్దరం రిజిష్టరు మారేజ్ చేసుకుందాం.. ఏమంటావ్?" అన్నాడో రోజు సాంబమూర్తి.

సాంబమూర్తి మాటలు ఆమెలో కొత్త ఆశల్ని రేకెత్తించాయి. తనకి చదువు పట్ల యెలాగూ ఆసక్తిలేదు. ఈ విధంగానైనా జీవితంలో స్థిరపడి పోతే నయమనుకుంది సునీత.

తల్లిదండ్రులు యేమంటారో నన్న భయాన్ని ఆ క్షణానికి ఒక ప్రక్కకి నెట్టేసింది, సునీత. ఒక విధమైన గుండె ధైర్యం, చొరవ, ఆమెను ముందుకు నడిపించాయి. ఇంకేం ఆలోచించలేదామె.

"మీరు నిజంగానే నన్ను ప్రేమిస్తున్నారా?" బేలగా ప్రశ్నించింది.

"ఈ అనుమానం నీకెందుకొచ్చిందో, అర్థం కావడంలేదు సునీతా; నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నువ్వంటే నాకు వల్లమాలిన అభిమానం. అందుకే, వివాహం చేసుకుందామంటున్నాను" అన్నాడు, సాంబమూర్తి.

సునీత మౌనం దాల్చి అవనితముఖి అయ్యింది. ఏం జవాబు చెబుతుంది? ఆయనంటే తనకీ యిష్టమే మరి! కాని, యెలా చెప్పడం?.. సందిగ్ధంలో పడింది. "నా అభిప్రాయం నేను చెప్పాను. ఇప్పుడు, నువ్వు చెప్పాలి. నేనంటే, నీకు యిష్టమేనా?" మళ్ళీ అన్నాడు సాంబమూర్తి.

సునీత ముసి ముసి నవ్వుతో ఔనన్నట్టుగా తలూపింది. సాంబమూర్తి లోలోన మురిసిపోయాడు.

"ఇప్పుడు నీ వయస్సెంత?" అడిగాడు.

"క్రితం నెలలోనే పద్దెనిమిది సంవత్సరాలు నిండాయండీ."

"అయితే నువ్వు మైనరువి కావు. ఎవ్వరడిగినా, మనం పరస్పరం యిష్టపడే వివాహం చేసుకున్నామని చెప్పు... ఏం?" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

సునీత అయోమయ స్థితిలో పడింది. ఎందుకో, ఆమె గుండెలో గుబులు రేకెత్తింది. మాట్లాడలేక పోయింది.

"ఏవిటలా ఆలోచిస్తున్నావు?"

"అబ్బే; ఏవీ లేదండీ."

"ఇటువంటి విషయాల్లో చాలా చొరవ, ధైర్యమూ అవసరం... రేపు వుదయం రామాలయం దగ్గరికి వచ్చేసెయ్... సరిగ్గా పదిగంటలకు మనం మేరేజ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకి వెళ్లిపోదాం. నా మిత్రులు అక్కడికొస్తారు, వాళ్ళే సాక్షులుగా వుంటారు..."

"ఏవిటో నండీ, నాకు భయంగా వుంది...." బెరుకుగా అంది.

సాంబమూర్తి నవ్వేడు.

"ఇంత పిరికిదానివైతే యేలా? ధైర్యం వుండాలి. ఏం భయంలేదు. నన్ను నమ్ము...." అన్నాడు. ఆమెలో నిబ్బరాన్ని కలిగిస్తూ..

సునీత అక్కణ్ణించి నిష్క్రమించింది....

నడుస్తున్నదేగాని, కాళ్ళు తడబడుతున్నాయి. ఏదో చెప్పలేని భయం, ఆమెను

ఆక్రమించుకుంటోంది. అయితే, గుండె నిబ్బరాన్ని పెంచుకుంది. ఇంటి పరిస్థితులు, తన భవిష్యత్తు - వీటిని దృష్టిలో పెట్టుకుని, ఒక నిర్ణయానికి కొచ్చేసి ఆ నిర్ణయంతో యిల్లు చేరుకుంది. సునీత. మర్నాడు నిర్ణయించుకున్నట్టుగానే, సాంబమూర్తి, సునీత రిజష్టర్ వివాహం చేసుకున్నారు. పరస్పరం దండలు మార్చుకున్నారు. వారి వివాహానికి ప్రత్యక్ష సాక్షులుగా , సాంబమూర్తి స్నేహితులు సూర్యం, రాజు రిజష్టరులో సంతకాలు పెట్టారు.

నూతన వధూవరులు, మెళ్ళో పూలహారాలతో, సునీత తల్లిదండ్రుల ఆశీస్సులు పొందడానికి వాళ్ళింటికి వెళ్ళారు.

సునీత తల్లిదండ్రులు, నిర్ఘాంతపోయారు. సునీత అంతకి తెగిస్తుందని, వాళ్ళేనాడూ ఊహించలేదు. తండ్రి నరసింహమూర్తి నిజంగానే నరసింహావతారం దాల్చాడు.

కోపంతో వూగిపోతూ, వాళ్ళిద్దర్నీ తన కళ్ళెదుట నుంచి పొమ్మన్నాడు. సునీత తల్లి కూడా యేమీ అనలేకపోయింది. కన్నీరు కార్చుతూ వుండిపోయింది.

సునీత - యింక అక్కడ నుంచోలేదు. సాంబమూర్తితో పాటు వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది, వాళ్ళింటికి. వాళ్ళది కొత్త సంసారం. సుఖమయ సంసారం చేసుకోవాలి ఇక.

రోజులు సాగిపోతున్నాయ్.

సునీతకి ఓ అబ్బాయి పుట్టాడు. ఆ దంపతులు యెంతగానో మురిసిపోయారు.

సాంబమూర్తికి, తన వాళ్ళంటూ యెవ్వరూ లేరు. కాని, సునీతకి అందరూ వున్నారు. ఏం లాభం? వుండీ, లేనట్టే అయ్యిందామెకి.

"సునీతా, మనబ్బాయిని తీసుకుని, మీ యింటికి వెళ్ళకూడదూ? వీణ్ణి చూశాకయినా మీ నాన్న హృదయం కరుగుతుందేమో?" అన్నాడో రోజు, సాంబమూర్తి.

సునీతకీ ఆ భావన మనసులోవున్నా, ఆనాటి సంఘటన కళ్ళలో మెదిలేసరికి, ఆ ఆలోచనను బలవంతంగా అణచివేసుకుంది.

"వద్దండీ! ఆనాటి అనుభవాన్ని యింకా నేను మర్చిపోలేదు. మా నాన్నకి పట్టుదలెక్కువ. ఆయన మారటం అనేది ఓ కల్ల. ఇంతవరకూ, నేను యెక్కడ వున్నానో, యెలా వున్నానో, వాళ్ళకి అవసరం లేనపుడు, నాకు మాత్రం వాళ్ళ పట్ల ఆసక్తి యెందుకుండాలి చెప్పండి? మనకి యెవ్వరూ లేరనే అనుకుందాం. మన బ్రతుకులు మనం బ్రతుకుదాం... " అంది, గుండె నిబ్బరంతో. అయినా ఆమె

కళ్లల్లో నీరు స్పష్టంగా అగుపించింది, సాంబమూర్తికి. భార్య మనసుని అర్థం చేసుకున్నాడు, సాంబమూర్తి.

"సరే, నీ యిష్టం" అనేసి బాబుని తన ఒళ్ళోకి తీసుకున్నాడు లాలనగా.

✪ ✪ ✪

వారి సంసార జీవితం, మూడు పువ్వులూ, ఆరు కాయలుగా సాగిపోతోంది.

జీవితంలో యెప్పుడేం జరుగుతుందో, యెవ్వరూ చెప్పలేరు. విధి వక్రదృష్టి, సాంబమూర్తి కుటుంబం మీద పడింది. ఊహించని రీతిలో సాంబమూర్తి ఓ లారీ క్రింద పడి మరణించాడు. సునీత జీవితంలో చీకట్లు ముసురుకున్నాయి. ఆమె నూరేళ్ళ వైవాహిక జీవితానికి హఠత్తుగ తెరపడింది. దిక్కులేనిదయ్యింది. ఆమె కళ్ళల్లో కన్నీరే కరువయ్యింది పాపం!

అప్పుడూ ఆమె తల్లిదండ్రులు ఆమెకి అండగా నిల్చోలేదు. కనీసం ఆమెను, ఓదార్చడానికి రాలేదు.

అటువంటి తరుణంలో అండగా నిల్చున్న వ్యక్తి సాంబమూర్తి స్నేహితుడు సూర్యం.

సాంబమూర్తి మరణించాక, చట్టరీత్యా అతని భార్య సునీతకు రావల్సిన పైకం, త్వరగా వచ్చేలా చేసి, ఆ పైకాన్ని బ్యాంకులో వేయించాడు.

సూర్యం చేసిన సహాయానికి, కృతజ్ఞత చెప్పుకోవడం, తన విద్యుక్త ధర్మం అనుకుంది. సునీత. "మీరు చేసిన సహాయానికి మనసారా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నానండీ సూర్యంగారు..." అంది, సునీత.

సూర్యం, సన్నగా నవ్వేడు, "మనలో మనకి కృతజ్ఞత లేవిటి లెంది" సునీతగారూ. సాంబమూర్తి నా సన్నిహిత స్నేహితుడు. వాడి అర్థాంగిగా మీకు, నేనీ పాటి సహాయం అందించకపోతే, యింక స్నేహానికి అర్థం యేముంది చెప్పండి? అది సరేగాని, యిప్పుడు మీ భవిష్యజ్జీవితం గురించి యేవిటాలోచించారు? మూర్తికి తన వాళ్ళంటూ యెవరూ లేరని నాకు తెలుసు. మరి మీరు మీ వాళ్ళింటికి వెళ్తారా?" వుండబట్టలేక అడిగాడు సూర్యం.

"సునీత, బరువుగా ఓ నిట్టూర్పు వదిలింది.

"అంతపాటి అదృష్టం, నాకు లేదండీ సూర్యంగారు. నా వాళ్ళకి నేనెప్పుడో దూరమయ్యాను. నాకు యెవ్వరూ లేరని, యేనాడో నిర్థారణ చేసుకున్నాను. ఆత్మాభిమానం అందరికీ ఒకే పాళ్ళలో

వుంటుంది కదండీ! ఒంటరిగా జీవితాన్ని గడపగలిగే మనోధైర్యం నాకుంది. నాకు టైలరింగు వచ్చు ఓ టైలరింగు మిషన్ కొనుక్కుంటే మా యిద్దరి పొట్ట నింపుకోగల సంపాదన తెచ్చుకోగలను" అంది నిబ్బరంగా, సునీత.

ఆమె ఆత్మ నిగ్రహానికి, ఆశ్చర్యపోవడమే కాదు మనసులోనే జోహారులర్పించాడు, సూర్యం. ఆమె మొహంలోకి పరిశీలనగా చూశాడు. ఆమె సౌందర్యంలో రంభ కాకపోయినా, అందంగానే వుంటుందనిపించింది. ఆమె విశాల నేత్రాలు, చంద్రాకారపు చిరునవ్వు, అతణ్ణి ఎప్పుడో ఆకర్షించాయి. అతని గుండెలకు, మన్మథబాణం తగిలింది.

"అదేమిటండీ అలా చూస్తున్నారు?" కంగారుగా అంది, సునీత. సూర్యం చూపుల్లో కొత్తదనం కనిపించిందామెకి.

సూర్యం ఊహాలోకం నించి వాస్తవ లోకంలో పడి తడబడిపోయాడు.

"అబ్బే! అబ్బే! ఏవీ లేదండీ!" తొట్రుపడుతూనే మొహం దించుకున్నాడు.

"ఏవటండీ ఆలోచిస్తున్నారు" మళ్ళీ ప్రశ్నించింది, సునీత.

"ఏవీ లేదండీ సునీతగారూ, మిమ్మల్ని, మీ పరిస్థితుల్ని చూస్తుంటే, జాలివేస్తోంది. ఈ పిన్న వయసులోనే, మీ అందం యిలా అడవిగాచిన వెన్నెల కావడం, నన్నెంతగానో బాధిస్తోందంటే నమ్మండి. నా ప్రియ స్నేహితుడి భార్యను యీ స్థితిలో చూడలేకపోతున్నానండీ! ఎలాగయినా మిమ్మల్ని ఆదుకోవాలన్న తహతహ, నాలో పరవళ్ళు తొక్కుతోందంటే, నమ్మండి. అందుకే.... అందుకే..." నీళ్ళు నమిలాడు, సూర్యం.

సూర్యం యేం చెప్పదల్చుకున్నాడో, ఆమెకి బోధపళ్ళేదు.

"అలా నీళ్ళు నములుతారేంటండీ! సూటిగా చెప్పండి" ధైర్యంగా అంది సునీత.

"అందుకే, మీకు అభ్యంతరం లేకపోతే, మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నానండీ! ఈ విధంగానైనా, నా మిత్రుడి ఆత్మకు శాంతిని చేకూర్చాలని నా మనస్సు వువ్విళ్ళూరుతోందండీ!" చొరవ చేసి చెప్పేశాడు, సూర్యం.

సునీత, క్షణం పాటు నిర్విణ్ణురాలై, సూర్యం కేసి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది. సూర్యం అలా అన్నందుకు, ఆమెకి కోపం రాలేదు. కాని, ఆశ్చర్యమేసింది. సూర్యం యింకా అవివాహితుడేనా అని.

"మీరింకా అవివాహితులేనా సూర్యంగారూ?" ప్రశ్నించింది, అతని కేసి వింతగా చూస్తూ.

సునీతకీ అనిపిస్తోంది, తన ఒంటరి జీవితానికిప్పుడు యేదో ఆలంబన అవసరమని.... తన యౌవ్వనం, అందం, వృధాకాకూడదని.

సూర్యం,తడబడకుండా చిన్నగా నవ్వేడు "ఔను సునీతగారూ! నేను కోరుకున్న అమ్మాయి దొరక్క, యింతవరకూ వివాహం చేసుకోలేదు" తొట్రపాటు లేకుండా, నిశ్చలంగా అన్నాడు సూర్యం.

సూర్యం, అంత నిశ్చలంగా చెబుతూ వుంటే అతను అబద్ధం చెబుతున్నాడన్న సందేహం రాలేదామెకి.

"అయితే, మీరు కోరుకున్న అమ్మాయిలా నేనున్నానా?" అతనికేసి ఓరగా చూసూ&త ప్రశ్నించింది సునీత.

సూర్యం మెల్లగా మందహాసం చేశాడు. తాను వేసిన వలలోకి ఆమె వచ్చేస్తున్నట్టు భావించాడు, సూర్యం.

"అక్షరాలా అలానే వున్నారండీ! మీరు అంగీకరిస్తే మిమ్మల్ని భార్యగా పొందటం, నా అదృష్టంగా భావిస్తాను" తన్మయత్వంతో అన్నాడు.

"నాకో బాబు వున్నాడని, మీకు తెలుసు కదా!"

"తెలీకపోవడమేవిటండీ? బాబుని ప్రత్యక్షంగా చూస్తున్నాను కూడా. నా యీ నిర్ణయానికి అదీ ఒక కారణమే! బాబులో నా స్నేహితుణ్ణి చూసుకుంటాను."

సూర్యం విశాల హృదయాన్ని మనసులో అభినందించుకుంది సునీత.

"మరి, మీ అమ్మా, నాన్న, ఒప్పుకుంటారా?" బేలగా అడిగింది.

"నాకు యెవ్వరూ లేరండీ, ఒకరు ఒప్పుకోవాలని, అంగీకారం తెలియజెయ్యాలన్న ప్రసక్తే లేదండీ."

క్షణం మౌనం దాల్చింది, సునీత. ఆమె మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు ముసురుకున్నాయి. సూర్యం మంచి మనిషిలానే వున్నాడు. కీర్తిశేషులైన తన భర్త స్నేహితుడిగా, తనపై సానుభూతితో తనని యీ పరిస్థితుల్లో ఆదుకోడానికే ముందుకు వస్తున్నాడు. ఎందుకూ అంటే, యింతకు ముందెప్పుడూ అతని ఆలోచనల్లోనూ, చూపుల్లోనూ దోషాన్ని చూళ్ళేదు, తాను అంచేత, అతన్ని అనుమానించడంలో అర్థం లేదనుకుంది.

తన భర్తలాంటి మనస్తత్వమే సూర్యంది కూడాను. అంచేత, తనకీ ఓ విధమైన ఓదార్పు వుంటుంది

అనుకుని ఓ నిశ్చయానికి వచ్చింది సునీత.

"అయితే నాకు అభ్యంతరం లేదండీ! అంది మొహం దించుకుని ముసిముసి నవ్వులు నవ్వుతూ.

సూర్యం మొహంలో, కొత్తకాంతి మెరిసింది. అతని హృదయం, ఆనందంతో పుప్పొంగి పోయింది. ఆమె, అంత తొందరగా అంగీకరిస్తుందని, అతననుకోలేదు. అందుకే ఆ ఆనందం.

"అబ్బ! యెంత చల్లని మాట చెప్పారండీ! నిజంగా, ఆనందాన్ని పట్టలేకపోతున్నాను. ఇహ బాబుని చూస్తూ, నా స్నేహితుడు సాంబమూర్తి నాకు దూరమైపోలేదన్న తృప్తి ఆ భావం, నాలో నిండి వుంటుందండీ. మరింక ఆలస్యం దేనికి పదండి.... దేవుని సన్నిధానంలో పూలదండలు మార్చేసుకుందాం" అన్నాడు సూర్యం, వుత్సాహంగా.

సునీత, అడ్డు చెప్పలేదు. వాడిపోయిందనుకున్న తన జీవితం, మళ్ళీ చిగురిస్తున్నందుకు మురిసిపోయింది. ఆమెకి సూర్యంపై సంపూర్ణ విశ్వాసం వుంది. అందుకే, అతని పట్ల యెటువంటి అనుమానానికి తావులేకపోయింది.

చంటాణ్ణి యెత్తుకుని, యింటికి తాళం వేసి, సూర్యం వెంట బయల్దేరింది సునీత దేవాలయానికి.

✪ ✪ ✪

రోజులు గడిచిపోతున్నాయ్.

కొన్నాళ్ళు సూర్యం, సునీతల సంసారజీవితం సాఫీగానే సాగింది. ఒక్కొక్కప్పుడు సూర్యం రాత్రుళ్ళు వచ్చేవాడు కాదు. సునీత కారణం అడిగితే, నైట్ డ్యూటీ అని పచ్చి అబద్ధం చెప్పేవాడు, సూర్యం. ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చడానికి, ఎన్నో అబద్ధాలాడాల్సిందే మరి.

మొదట్లో సునీత భావించినట్టుగా, టైలరింగు మిషను కొనుక్కోలేదు. ఇపుడు దాని అవసరం యింకేముందన్నాడు సూర్యం. సునీత మరేం మాట్లాడలేదు.

బ్యాంకులో సునీత పేర వున్న డబ్బు చాలా వరకు విత్ డ్రా చేశాడు, సూర్యం. సునీతకి తనపై గల నమ్మకాన్ని ఆధారం చేసుకుని, ఆమె సంతకం తీసుకున్న విత్‌డ్రాయల్ ఫారమ్‌లో అంకెలు మార్చేసి, ఆమెకి తెలీకుండా, ఎక్కువ డబ్బు తెచ్చుకునేవాడు. ఆ విధంగా, బ్యాంకులోని డబ్బులో అధిక భాగానికి కాళ్ళొచ్చినయ్. బ్యాంకు పాసు బుక్ సూర్యం తన దగ్గరే వుంచుకున్నాడు గాబట్టి, నిజాన్ని తెలుసుకునే అవకాశం సునీతకి లేకపోయింది.

హఠాత్తుగా సూర్యం వారం రోజుల్నించి యింటికి రాకపోవడంతో, కంగారుపడింది సునీత.

వాళ్ళ ఆఫీసుకి వెళ్ళి ఆరాతీస్తే సూర్యం వుద్యోగానికి రాజీనామా చేశాడని, అతడు వివాహితుడని, ఓ పాపకు తండ్రి అని తెలిసింది, సునీతకి. సునీతకి కళ్ళు తిరిగినయ్. సుమారు మూర్ఛపోయినట్టయ్యింది. ఎంతో కష్టం మీద యిల్లు చేరుకుంది.

సునీతకిప్పుడు అర్థమైపోయింది, సూర్యం తనని మోసగించాడని. కాని, యేం చెయ్యగలదు? తమ వివాహానికి సాక్షులెవ్వరూ లేరాయె - చలనం లేని రాతి దేవుడు మినహా ఆ దేవుడే మళ్ళీ తనకి అన్యాయం చేశాడనుకుని బావురుమంది.

అటువంటి క్లిష్ట పరిస్థితిలో , యిల్లు కట్టడపు పనిలో కూలిపనికి కుదురుకోక తప్పలేదు సునీతకి. అటు దేవుడూ యిటు దేవుడు సృష్టించిన మనుషులు తనకి అన్యాయం చేశారు. ఇంక తాను చెయ్యగలిగిందేవిటి.... అనుకుంది.

సునీత తట్టని తలమీద పెట్టుకుని, నిచ్చెనపై ఎక్కుతూ మీదనున్న వారికి తట్ట అందిస్తూ వుండటం, అప్పుడే వచ్చిన కాంట్రాక్టరు నారాయణ కంటబడింది. అతనికి ఎంతో జాలి కలిగింది.

"మేస్త్రీ..." మెల్లగా పిల్చాడు.

"అయ్యా....." మేస్త్రీ సవినయంగా అతని దగ్గరికొచ్చాడు.

"అదిగో, ఆ నిచ్చెన దిగుతున్నామె పేరేమిటి?"

"సునీతండీ..."

"ఆవిణ్ణి ఓసారి పిలువ్..."

"సునీతా, యిలారా ఓసారి... అయ్యగారు పిలుస్తున్నారు" అంటూ కేక వేశాడు మేస్త్రీ.

సునీత గుండెలు, విపరీతంగా కొట్టుకున్నాయి. బితుకు బితుకుమంటూ నారాయణ వున్న చోటుకి వచ్చింది.

"చూడమ్మా సునీతా, నువ్వీ పని చెయ్యలేవు. నిచ్చెన ఎక్కుతున్నప్పుడు, తూలి పడిపోతావేమోనని, నాకే భయమేస్తోంది. ఈ వయసులో అటువంటి ప్రమాదం ఏదన్నా జరిగితే, నీ బ్రతుకేం కావాలి చెప్పు? ఈ కూలిపని మానేయకూడదూ?" అన్నాడు కంట్రాక్టరు నారాయణ.

సునీత ఒక్కసారి షాక్ తింది. ఆమె కళ్ళ వెంబడి, అప్రయత్నంగా అశ్రుధారలు స్రవించినయ్. కూలిపని మానేయడం....కాని తన కడుపు నిండేదెలా? తన బాబు ఆకలి తీరేదెలా? "నా పట్ల జాలితో మానేయమని చెబుతున్నారు...... బాగానే వుంది, కాని.... యీ కూలిపని చెయ్యడం, నాకు

సరదా అనుకుంటున్నారా? నా జీవితం గురించి ఏమాత్రం మీకు తెలిసినా, మీరీ మాట అని వుండేవారు కాదు....'' జీరవోయిన స్వరంతో అంటూ, తన గాధని చెప్పుకుపోయింది క్లుప్తంగా సునీత.

నారాయణ హృదయం, ద్రవించిపోయింది. జాలితో అతని కళ్ళు చెమ్మగిల్లాయి. ఎలా వుండాల్సిన సునీత జీవితం, ఎట్లా మారింది? దీనికి కారణం ఏమైనప్పటికీ, 'విధి' ఆమెను నిర్ధాక్షిణ్యంగా కాటేసిందనే చెప్పాలి.... అనుకున్నాడు మనసులో. అటువంటి దురదృష్ట వంతురాల్ని, అదుకోవాలనుకున్నాడు.

"నీ జీవిత గాధ వింటూ వుంటే, నా గుండెలు తరుక్కుపోతున్నాయమ్మా. ఈ స్థితికి నువ్వు దిగజారడానికి కారకులెవరైనా, దురదృష్టం నిన్ను అగాధంలోకి విసిరేసింది. నమ్మిన వాడే ద్రోహం చేస్తే, నువ్వు మాత్రం యేం చెయ్యగలవులే...'' అంటూ ఓదార్చాడు, నారాయణ.

మౌనంగా కుమిలిపోతోంది సునీత. "ఏడవకమ్మా సునీతా! ఇటువంటి పరిస్థితుల్లోనే ధైర్యంగా నిలబడాలి. నువ్వేమీ అనుకోకపోతే నాదో అభ్యర్ధన'' అంటూ అగాడు నారాయణ.

నారాయణగారు ఏం చెప్పబోతున్నారో మేస్రీకి అవగాహన కాలేదు. కళ్ళప్పగించి చూస్తున్నాడు. "చెప్పండి..'' మెల్లగా అంది సునీత, మొహం దించుకునే, "నాకు పదమూడేళ్ళు, పదేళ్ళ అమ్మాలు యిద్దరున్నారు. వాళ్ళమ్మ పోయి మూడేళ్ళయ్యింది. ఒక వంట మనిషిని పెట్టుకుని, వాళ్ళిద్దర్ని సాకుతున్నాను. నువ్వేమీ అనుకోకపోతే వాళ్ళకి ఆసరాగా మా యింటికొచ్చి వుండొచ్చు" అన్నాడు, నారాయణ. సునీత, కొయ్యబారిపొయింది. ఆర్ధ్ర హృదయంతో గుటకలు మింగుతోంది. ఆమెకి ఆ రోజుల్లో సూర్యం మాటలు గుర్తుకొచ్చినయ్. నారాయణగారికి, యీ వయసులో యిటువంటి దుర్భుద్ధి పుట్టిందేమిటి? మళ్ళీ మరో విషవలయం లోకి పోవడమా?.... ఆమె కిష్టంలేకపోయింది.

సునీత మానసిక ఆవేదన్ని గమనించాడు నారాయణ. ఆమె తనని తప్పుగా అర్ధం చేసుకుందనిపించిందతనికి. మెల్లగా మందహాసం చేశాడు. "నా అభ్యర్ధన, నిన్ను కలవరపర్చి వుండొచ్చునమ్మా. ఎందుకూ అంటే, ఏ స్థాయిలో నిన్ను నా యింటికి ఆహ్వానిస్తున్నానో, నువ్వా గ్రహించలేదు. నేనూ వివరంగా చెప్పలేదు.

"జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్న నిన్ను, నా అర్ధాంగిగా నా యింటికి ఆహ్వానించే టంతటి దుర్మార్గుణ్ని, మనసులేని వాణ్ణే కాదమ్మా నేను. నాకు పెద్ద కూతురుగా, నా యిద్దరు కూతుళ్ళకి అక్కగా మా ఇంట్లో అడుగుపెట్టమనే నా అభిమతం తల్లీ. భగవంతుని సాక్షిగా చెబుతున్నాను, నా

అంతరంగంలో ఎటువంటి దుర్బుద్ధి లేదమ్మా సునీత! నన్ను నీ తండ్రి అనుకుని నా అభ్యర్థన్ని మన్నించమ్మా'' అన్నాడు, నారాయణ. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

అక్కడున్న మేస్త్రీ యితర కూలీలు నారాయణ మాటలు విని, ముగ్ధులైపోయారు. వారి మనసుల్లో ఆనందం వెల్లివిరిసింది. వాళ్ళందరికీ సునీత పట్ల సానుభూతి వుందాయె. నారాయణ తీసుకున్న నిర్ణయం, మానవతా దృక్పథంతో కూడుకున్నదనిపించింది వారికి.

''అమ్మా సునీతా! అయ్యగారు చాలా మంచివారమ్మా. నీ మనసులో ఎటువంటి అనుమానం పెట్టుకోకుండా ఆయనతో వెళ్ళమ్మా! ఆయన చల్లని నీడలో ఓ కూతురుగా నువ్వు సుఖపడతావు'' అన్నాడు మేస్త్రీ.

నారాయణని నమ్మకుండా వుండలేకపోయింది సునీత. ఆమె కళ్లలో ఆనందభాష్పాలు తళుక్కున మెరిసి చెక్కిళ్ళ మీదికి జాలు వారినయ్. నారాయణకేసి కృతజ్ఞతా పూర్వకంగా చూసింది.

''బాబాయ్‌గారూ, దేవుడు నాకు అన్యాయం చేశాడనుకున్నాను. కాని, యిప్పుడు మీలో దేవుణ్ని చూస్తున్నానండీ!'' అంది సునీత. ఆనంద భాష్పాలు ఒత్తుకుంటూ.....

''పదమ్మా వెళ్దాం. నా మనవణ్ణి తీసుకుపోదాం..'' అంటూ వాత్సల్యంగా ఆమె భుజం మీద చేయివేసి తీసుకుపోయాడు. నారాయణ పనివాళ్ళు. హర్షాతిరేకంతో వుప్పొంగిపోయారు.

□□□

అంజలి తేదీ 14-1-94